

హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్, ఎస్పీ అపూర్వరావు

## హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

దేవరకొండ, అక్టోబర్ 27 : దేవరకొండలో జరిగే ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరు కానున్న దృష్ట్యా హెలిప్యాడ్, సభా స్థలాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, ఎస్పీ అపూర్వరావు పరిశీలించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ సమీపంలో ఉన్న స్థలంలో పార్కింగ్‌తో పాటు సభ నిర్వహించేందుకు అనువుగా ఉండే ప్రదేశాన్ని పరిశీలించారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని వారు ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి సభా స్థలం వరకు ఉన్న దారిని సరి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. వారి వెంట డీఎస్పీ గిరిబాబు, ఆర్డీఓ శ్రీరాములు, ఆర్అండ్‌బీ ఈఈ నరేశ్, డీఈ భాస్కర్. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### స్ట్రాంగ్‌రూం పరిశీలన

దేవరకొండ : అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఎన్నికల ప్రక్రియ, మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎన్నికల అధికారుల శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ అందించనున్నట్లు చెప్పారు. అనంతరం దొంతినేని వెంకటనర్సమ్మ ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌ను ఎస్పీతో కలిసి పరిశీలించారు.

## కాంగ్రెస్ రెండో జాబితాలో మరో ముగ్గురికి చోటు

- మునుగోడులో కృష్ణారెడ్డి, స్రవంతికి హ్యాండ్ ఇచ్చిన అధిష్ఠానం
- ఒక్కరోజులో పార్టీలోకి వచ్చిన రాజగోపాల్ రెడ్డికి టికెట్
- దేవరకొండలోనూ అసంతృప్తిలో రమేశ్‌నాయక్, కిషన్‌నాయక్
- పెండింగ్ లో మరో మూడు సీట్లు

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ రెండో జాబితాలో ఉమ్మడి జిల్లాలోని మరో మూడు స్థానాలకే అభ్యర్థులను ప్రకటించారు. దీనితో ఇప్పటికే మొత్తం తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు అయింది. శుక్రవారం ప్రకటించిన జాబితాలో మునుగోడు నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, దేవరకొండ నుంచి నేనావత్ బాలూనాయక్, భువనగిరి నుంచి కుంభం అనిల్ కుమార్ రెడ్డికి స్థానం లభించింది. మిర్యాలగూడ, సూర్యాపేట, తుంగతుర్తి స్థానాల్లో నేటికీ ఎటూ తేల్చలేకపోయింది. కాగా రెండో జాబితా విషయంలో మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. మునుగోడులో ఆది నుంచి చలమళ్ల కృష్ణారెడ్డి టికెట్ ఆశిస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టారు. గతేడాది చివర్లో జరిగిన ఉప ఎన్నికల్లోనే టికెట్ కోసం తీవ్రంగా పోటీపడ్డారు. కానీ పార్టీలో అంతర్గత పోరుతో ఆయనకు టికెట్ దక్కలేదు. అప్పట్లో తన తమ్ముడు రాజగోపాల్ రెడ్డి బీజేపీ నుంచి గెలవాలంటే... కాంగ్రెస్ టికెట్ కృష్ణా రెడ్డికి ఇవ్వొద్దని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అడ్డుపడ్డారు. దీంతో స్రవంతికి టికెట్ కేటాయించారు. ఇక ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాభవం ఎదురుకావడంతో అనంతరం చలమల కృష్ణారెడ్డి యాక్టీవ్ అయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో టికెట్ గ్యారంటీ అని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీతో ఇప్పటికే చాలా డబ్బు ఖర్చు చేసి తిరిగి పార్టీని నిలబెట్టే ప్రయత్నం చేశాడు. రేవంత్‌రెడ్డి హామీతో చివరి నిమిషం వరకు తనకే టికెట్ అన్న భరోసాతో ఉన్న కృష్ణారెడ్డికి రెండో జాబితాతో ఝలక్ ఇచ్చినట్లు అయింది. దీంతో కృష్ణారెడ్డితో పాటు ఆయన అనుచరులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలిసింది. కష్టకాలంలో పార్టీని వదిలేసి తన వ్యాపార ప్రయోజనాల కోసం బీజేపీలో చేరి ద్రోహం చేసిన రాజగోపాల్‌రెడ్డికి తిరిగి టికెట్ ఇవ్వడం ఏంటన్న ప్రశ్నలు వెళువెత్తుతున్నాయి. పార్టీని, పార్టీ పెద్దలను అడ్డగోలుగా తిట్టినా రాజగోపాల్ రెడ్డికి ఎలా టికెట్ ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. పాల్వాయి స్రవంతి, పున్న కైలాష్ నేతలు సైతం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. ఇక దేవరకొండ టికెట్ ఆశించిన వడ్త్యా రమేశ్‌నాయక్, నేనావత్ కిషన్‌లాల్‌నాయక్ కూడా అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఇక్కడ బాలూనాయక్ మధ్యలో వేరే పార్టీకి వెళ్లడంతో వీరు పార్టీని నిలబెట్టే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం టికెట్ బాలూనాయక్‌కు ఇవ్వడంతో వీరు ఏ మేరకు సహకరిస్తారు అనేది తెలాల్సి ఉన్నది. ఇక భువనగిరి లోనూ కుంభం అనిల్ కుమార్ కు టికెట్ రావడంతో బీసీ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ఆశించిన రామాంజనేయులు గౌడ్ లాంటి వాళ్లు ఏమీ చేస్తారో వేచి చూడాలి. ఇక సూర్యాపేటలో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి మధ్య టికెట్ కోసం హోరహోరీ నెలకొంది. తుంగతుర్తిలోనూ అద్దంకి దయాకర్ పోటీ చేస్తాడా లేడా ఇతరులకు టికెట్ ఇస్తారా అనేది స్పష్టం కాలేదని తెలిసింది. ఇక మిర్యాలగూడను పొత్తులో భాగంగా సీపీఎంకు కేటాయిస్తారన్న చర్చ ఉన్నది. సీపీఎంతో పొత్తు తేలకపోవడంతోనే ఇది పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. మిర్యాలగూడను సీపీఎంకు కేటాయిస్తే ఇక్కడ టికెట్ ఆశిస్తున్న బత్తుల లక్ష్మారెడ్డి ఏమీ చేస్తాడు అనేది కూడా ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

# అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించండి

- సీఎం కేసీఆర్ పాలనలో అన్ని రంగాల్లో దేవరకొండ అభివృద్ధి
- ప్రతి గడపకూ చేరిన సంక్షేమ ఫలాలు
- ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి, అక్టోబర్ 27 : స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో దేవరకొండ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు మరోసారి ఆశీర్వదిస్తే నిత్యం అందుబాటులో ఉండి మరింత అభివృద్ధి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం మండంలోని వడ్త్యా తండా, గాజీనగర్, చింతచెట్టుతండా కోల్‌ముంతల్‌పహాడ్, రామునిగుండ్లతండా, కొత్తబావి, కేశ్యా తండా, గుర్రపుతండా, దంజీలాల్‌తండా, గన్యా నాయక్‌తండా, చెన్నారం, ఆంబోతుతండా గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఒక్క చాన్స్ ఇవ్వండి అంటూ కాంగ్రెస్ నాయకులు కర్ణాటక ప్రజలను ప్రాథేయపడితే వారు నమ్మి ఓటేశారని, ఇప్పుడు రోడ్లపైకి వచ్చే దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 11 సార్లు అధికారమిస్తే తెలంగాణను అన్ని రంగాల్లో వెనుక బాటుకు గురి చేసిందన్నారు. కొత్త సీసాలో పాత సారా అన్నట్లు కాంగ్రెస్ నేతలు మారి కొత్త వేషాలతో ప్రజలను మభ్య పెట్టేందుకు మరోసారి వస్తున్నారని, వీరి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 2014కు ముందున్న పరిస్థితులు, స్వరాష్ట్రంలో తొమ్మదిన్నరేండ్లలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకొని ప్రజలు ఆలోచించాలన్నారు. కేసీఆర్ భరోసా పేరిట బీఆర్ఎస్ మ్యానిఫెస్టో రూపొందించామని తిరిగి అధికారంలోకి రాగానే అందులోని 15 పథకాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. రైతుబంధును రూ.16 వేలకు, ఆసరా పింఛన్లు రూ.5 వేలకు, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచుతామని, గ్యాస్ సిలిండర్ రూ.400కే అందిస్తామని, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.15 లక్షల వరకు వైద్యం అందిస్తామని, ప్రతి ఇంటి మహిళకు సౌభాగ్యలక్ష్మి పేరిట రూ.3 వేలు, ప్రతి కుటుంబాని ఆర్థిక భరోసాగా బీమా కల్పించనున్నట్లు చెప్పారు. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు పూటకొకటిగా ఎగిరి పోతున్నాయని, ఆరు నెలలకే కర్ణాటక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, మరి తెలంగాణలో ఆ పార్టీ ఇచ్చిన గ్యారంటీ హామీలను ప్రజలు ఎలా నమ్మాలో ఆ పార్టీ నాయకులను ప్రశ్నించాలని కోరారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని, రాష్ట్ర మరింత అభివృద్ధి చెందేలా మరోసారి బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు బిల్యానాయక్, గుత్తా అమిత్‌రెడ్డి

### ప్రతి ఇంటికీ తాగునీటి ఘనత బీఆర్ఎస్‌దే

బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో ప్రజలు మూడు కిలోమీటర్లు దూరం వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారని, అదే తెలంగాణలో సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీరు, 24 గంటల కరెంట్ ఇస్తున్నారని గుర్తు చేశారు. కేసీఆర్ లేని తెలంగాణ ఊహించుకోలేమని, బీఆర్ఎస్‌ను కాదని ఇతరులకు అవకాశం ఇస్తే రాష్ట్రం ఏర్పాటుకు పూర్వం ఉండే పరిస్థితి పునరావృతమవుతుందన్నారు. దేవరకొండ ఎమ్మెల్యేగా తాను ప్రజల మధ్యే ఉంటూ దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, అనేక మార్పులు తెచ్చానని అన్నారు. అదే కాంగ్రెస్ నాయకులు కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే కనిపిస్తారన్నారు. దేవరకొండ అభివృద్ధిని కొనసాగించేందుకు తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యానాయక్, గుత్తా అమిత్‌రెడ్డి, జడ్పీటీసీ సలహాదారుడు పస్నూరి యుగేంధర్‌రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌గౌడ్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్, యూత్ అధ్యక్షుడు రమావత్ తులసీరాం నాయక్, మాజీ ఎంపీపీ మేకల శ్రీనివాస్ యాదవ్, ఎంపీటీసీలు లక్కీదాస్, వస్కుల తిరుపతమ్మాకాశయ్య, సర్పంచులు వడ్త్యా బలరాం, పేట రమేశ్, కైకబద్దునాయక్, అరుణా శక్రునాయక్, జబ్బు యాదయ్య, రమావత్ జ్యోతీదస్రూనాయక్, అనితా రాములునాయక్, లలితా భీంసింగ్‌నాయక్, రమావత్ రాములు నాయక్, శ్రీను నాయక్, పంగా లాలయ్య, షేక్ ఇస్మాయిల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

### ఆలయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

చందంపేట, అక్టోబర్ 27 : రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని దేవరకొండ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని మానావత్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చంద్రునాయక్‌తండాలో నిర్మిస్తున్న తుల్జా భవాని, మేరమ్మ అమ్మవారి ఆలయాలకు భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు రమావత్ మోహన్‌కృష్ణ, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మన్న, నాయకులు వెంకట్‌రెడ్డి, గోపి, పెద్దులు, శంకర్‌నాయక్, చందర్‌సింగ్, లోక్యానాయక్, సరియా, పాండునాయక్, సందీప్, లక్పతి, సోమ్లా, రామ, భాస్కర్, కొండల్, భాను పాల్గొన్నారు.



ఆలయానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

## చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ఎస్పీ

మాల్, అక్టోబర్ 27: చింతపల్లి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ అపూర్వరావు సందర్శించారు. రికార్డులు పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో రహదారులపై తనిఖీలు నిర్వహించాలని, బెల్టు షాపులు నిర్వహించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట ఎస్ఐ సతీశ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## రూ.17 లక్షలు సీజ్

కొండమల్లేపల్లి, అక్టోబర్ 27 : ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 17.12 లక్షలను సీజ్ చేసినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టగా కుంచపర్తి రాధాకృష్ణ స్థానిక చౌరస్తాలోని యూనియన్ బ్యాంక్ నుంచి నగదును డ్రా చేసి సాగర్ రోడ్డులో గల గణేశ్ కాటన్ మిల్లుకు తీసుకెళ్తుండగా ఎన్నికల నిబంధనల ప్రకారం పట్టుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సీజ్ చేసిన నగదును రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

## పత్తిలో తేమ గుర్తించే పరికరాలను రైతులు వినియోగించుకోవాలి

మాల్, అక్టోబర్ 27: పత్తిలో తేమను గుర్తించే పరికరాలను రైతువేదికల వద్ద అందుబాటులో ఉంచామని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రవణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. రైతులు పత్తిని నేరుగా సీసీ కేంద్రాలకు తరలించి ఇబ్బందులు పడవద్దని, పత్తిలో 8 శాతం తేమ ఉండేలా చూసుకొని కేంద్రాలకు తీసుకెళితే మద్దతే ధర పొందవచ్చన్నారు.